నమస్తే తెలంగాణ
నల్లగొండ
5 | నల్లగొండ, మంగళవారం 12 మార్చి 2024 | NALGONDA

ఉద్యోగుల డేటాను వెంటనే అందించాలి

- కలెక్టర్ హరిచందన

నల్లగొండ, మార్చి 11 : పార్లమెంట్ ఎన్నికల నేపథ్యంలో ఉద్యోగులు తమ డేటాను వెంటనే సమర్పించాలని కలెక్టర్ దాసరి హరిచందన ఆదేశించారు. కలెక్టరేట్‌లో సంబంధిత అధికారులతో సోమవారం సమావేశం ఏర్పాటు చేశారు. టీఎస్ ఐపాస్, డీఐపీసీ కింద వచ్చిన దరఖాస్తులపై సమీక్షించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ టీఎస్ ఐపాస్ కింద వచ్చిన దరఖాస్తులన్నింటినీ ఆయా శాఖలు సకాలంలో పరిశీలించి అనుమతులు ఇస్తుండగా.. నిర్దేశించిన సమయంలో అనుమతులు ఇవ్వడంపై ఎక్కువ దృష్టి కేంద్రీకరించాలని సూచించారు. డీఐపీసీ కింద ఎస్సీ, ఎస్టీ యూనిట్లకు సుమారు 56 దరఖాస్తులు రాగా, వాటన్నింటినీ పరిశీలించి సిద్ధంగా ఉంచడం జరిగిందని, రవాణా శాఖ అనుమతి వచ్చిన తర్వాత వాటికి మంజూరు ఇవ్వడం జరుగుతుందని తెలిపారు. సమావేశంలో రెవెన్యూ అదనపు కలెక్టర్ జె.శ్రీనివాస్, డీఆర్‌డీఓ రాజ్యలక్ష్మి పాల్గొన్నారు.

నల్లగొండ ఉమ్మడి జిల్లా నేతలతో సమావేశమైన బీఆర్ఎస్ అధినేత కేసీఆర్

కేసీఆర్‌తో బీఆర్ఎస్ ముఖ్య నేతల భేటీ

నల్లగొండ ప్రతినిధి, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : ఉమ్మడి నల్లగొండ జిల్లాకు చెందిన బీఆర్ఎస్ ముఖ్య నేతలు మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి ఆధ్వర్యంలో బీఆర్ఎస్ అధినేత, మాజీ సీఎం కేసీఆర్‌ను కలిశారు. సోమవారం హైదరాబాద్ నందినగర్‌లోని ఆయన నివాసంలో భేటీ అయ్యారు. ఈ సందర్భంగా పార్లమెంట్ ఎన్నికలు, అభ్యర్థుల ఎంపిక, జిల్లాలో ప్రస్తుత రాజకీయ పరిస్థితులు తదితర అంశాలపై చర్చించారు. లోక్‌సభ అభ్యర్థుల ఎంపిక కోసం ఒక్కో నియోజకవర్గం నుంచి రెండు, మూడు పేర్లపై చర్చ జరిగినట్లు సమాచారం. అన్ని అంశాలను పరిగణలోకి తీసుకుని రెండు, మూడు రోజుల్లో పార్టీ అధినేత కేసీఆర్ ఆదేశాల మేరకు అభ్యర్థులను ప్రకటించనున్నట్లు తెలిసింది. కేసీఆర్‌ను కలిసిన వారిలో ఎంపీ బడుగుల లింగయ్య యాదవ్, ఎమ్మెల్యే పల్లా రాజేశ్వర్‌రెడ్డి, ఎమ్మెల్సీ ఎంసీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు రమావత్ రవీంద్రకుమార్, గాదరి కిశోర్‌కుమార్, గొంగిడి సునీతామహేందర్‌రెడ్డి, చిరుమర్తి లింగయ్య, నల్లమోతు భాస్కర్‌రావు, కూసుకుంట్ల ప్రభాకర్‌రెడ్డి, కంచర్ల భూపాల్‌రెడ్డి, బొల్లం మల్లయ్యయాదవ్, కంచర్ల కృష్ణారెడ్డి, చెరుకు సుధాకర్, ఒంటెద్దు నర్సింహారెడ్డి ఉన్నారు.

బీసీ హక్కుల సాధన రౌండ్ టేబుల్ సమావేశంలో మాట్లాడుతున్న ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత, వేదికపై మాజీ ఎమ్మెల్యే భగత్, సాహితీవేత్త జూలూరి గౌరీశంకర్, గట్టు రాంచందర్‌రావు, రాజారాం యాదవ్, దూదిమెట్ల

బీసీ బిల్లుపై తీర్మానం కాదు.. చట్టం చేయాలి

- సబ్‌ప్లాన్ అమలు చేసి ఏడాదికి రూ.20వేల కోట్లు ఇవ్వాలి
- కుల గణన చేసి స్థానిక రిజర్వేషన్లలో 42శాతం అమలు చేయాలి
- మొదటగా అసెంబ్లీలో బీసీల బాపూ పూలే విగ్రహం ఏర్పాటు చేయాలి
- ఎమ్మెల్సీ, భారత జాగృతి వ్యవస్థాపకురాలు కల్వకుంట్ల కవిత
- బీసీలకు అండగా ఉద్యమిస్తానని ప్రకటన
- కామారెడ్డి డిక్లరేషన్ అమలుపై బీసీ నేతల డిమాండ్
- హామీ ఇచ్చి విస్మరిస్తున్నారని సీఎం రేవంత్‌రెడ్డిపై ఫైర్
- బీసీల హక్కుల సాధనపై నల్లగొండలో రౌండ్‌టేబుల్

నల్లగొండ, మార్చి 11 : 'రాష్ట్రంలో కాంగ్రెస్ పార్టీ అధికారంలోకి రాగానే కుల గణన చేస్తాం.. దాని ఆధారంగానే స్థానిక సంస్థల్లో 42 శాతం రిజర్వేషన్ అమలు చేసి 23,500 మందికి పదవులు వచ్చేలా చర్యలు తీసుకుంటాం. సబ్ ప్లాన్ అమలు చేసి ఏడాదికి రూ.20వేల కోట్లు కేటాయిస్తాం. అసెంబ్లీలో బీసీల ఆరాధ్య దైవం మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహం ఆయన జయంతిలోపు ఏర్పాటు చేస్తాం' అని కాంగ్రెస్ పార్టీ కామారెడ్డిలో చేసిన బీసీ డిక్లరేషన్‌కు వెంటనే అమలు చేయాలని బీసీ సంఘాల నేతలు ముక్తకంఠంతో డిమాండ్ చేశారు. నల్లగొండలోని చిన్న వెంకట్‌రెడ్డి ఫంక్షన్ హాల్‌లో సోమవారం బీసీల హక్కుల సాధన కోసం నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశం ఈ మేరకు నినదించారు. యునైటెడ్ పూలే ఫ్రంట్, భారత జాగృతి సంయుక్తంగా నిర్వహించిన రౌండ్ టేబుల్ సమావేశానికి తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్, సాహితీవేత్త జూలూరి గౌరీశంకర్ అధ్యక్షత వహించగా.. భారత జాగృతి వ్యవస్థాపక అధ్యక్షురాలు, ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. మూడున్నర గంటల పాటు కొనసాగిన సమావేశంలో 28 మంది ప్రభుత్వానికి సూచనలు చేశారు. బీసీల హక్కుల సాధన కోసం ముందుకు సాగుతామని స్పష్టం చేశారు. ప్రధానంగా కామారెడ్డిలో రేవంత్‌రెడ్డి ఆధ్వర్యంలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని ప్రభుత్వంపై తేవాలని, రేవంత్ సర్కార్ పట్టించుకోకపోతే అవసరమైతే డిల్లీ వరకు తీసుకువెళ్లాలని ఎమ్మెల్సీ కవిత బీసీ సంఘాల నేతలకు పిలుపునిచ్చారు.

వచ్చే నెల 11లోపు అసెంబ్లీలో పూలే విగ్రహాన్ని పెట్టాలి : ఎమ్మెల్సీ కవిత

వచ్చే 11న బీసీల బాపూ పూలే విగ్రహాన్ని అసెంబ్లీలో పెట్టి కామారెడ్డిలో ప్రకటించిన బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేశారు. దేశంలో బీసీలు ఎక్కువగా ఉన్నప్పటికీ కేంద్రంలో తొలుత అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ మొదలు నేటి బీజేపీ వరకు కుల గణన చేయకపోవడం వల్ల బీసీల్లో ఎంతమంది ఉన్నారు.. వారికి ఎంత రిజర్వేషన్ ఇవ్వాలనే స్పష్టత లోపించి ఆ వర్గాలకు అన్యాయం జరుగుతున్నదన్నారు. తొలుత 1931లో కుల గణన చేస్తే, ఆ తర్వాత 1996, 2006లో కాంగ్రెస్ ప్రభుత్వం కుల గణన చేస్తామని రూ.4,500 కోట్లు ఖర్చు చేసి అగ్రవర్ణాల ఒత్తిడితో ఆ లెక్కలు బయటికి చెప్పలేదని తెలిపారు. బీసీల్లో మహిళలకు ఉప కోటా అని, మహిళలను మొత్తంగా బీసీ కింద పరిగణించాలనే సాకుతో చివరికి మండలి కమిషన్‌ను కూడా అమలు చేయకుండా ఉంటే ప్రస్తుతం కొన్ని రాష్ట్రాల్లో ప్రాంతీయ పార్టీలు కుల గణన చేస్తున్నాయని చెప్పారు. బీసీలకు రాజ్యాధికారం రావాలన్నా, విద్య, ఉద్యోగ అవకాశాల్లో న్యాయం జరుగాలన్నా కులగణన తప్పనిసరి అని వివరించారు. బహుజనులకు న్యాయం జరుగాలని పూలే ఎంతో పోరాటం చేశారని, అలాంటి మహోన్నత వ్యక్తి విగ్రహాన్ని అసెంబ్లీలో పెడుతామని ప్రకటించి ఎందుకు దాట వేస్తున్నారని కాంగ్రెస్‌ను ప్రశ్నించారు. అసెంబ్లీలో పూలే విగ్రహం పెట్టిన తర్వాత బీసీ బిల్లు పెట్టి చట్టం చేయాలని డిమాండ్ చేశారు. ఇప్పుడు చేసిన తీర్మానాలతో ఉపయోగం లేదని, దాన్ని చట్టం చేసి ఆ తర్వాత ఇచ్చిన మాటకు అనుగుణంగా బీసీ సబ్‌ప్లాన్‌కు ఏటా రూ.20 కోట్లు కేటాయించాలని డిమాండ్ చేశారు. కుల గణన అనంతరం వచ్చే స్థానిక సంస్థల ఎన్నికల్లో బీసీలకు 42 శాతం రిజర్వేషన్లు అమలు చేయాలన్నారు. కార్యక్రమంలో భారత జాగృతి నల్లగొండ జిల్లా అధ్యక్షుడు బోనగిరి దేవేందర్, నల్లగొండ మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ చీర పంకజ్‌యాదవ్, యునైటెడ్ పూలే ఫ్రంట్ కో కన్వీనర్లు రాజారాం యాదవ్, బోల్ల శివశంకర్, ఎంబీసీ రాష్ట్ర నాయకులు కొండూరు సత్యనారాయణ, బీసీ సంక్షేమ సంఘం జిల్లా అధ్యక్షుడు దుడుకు లక్ష్మీనారాయణ, బీసీ విద్యార్థి సంఘం రాష్ట్ర అధ్యక్షుడు మహేశ్‌గౌడ్, శ్రీకాంత్‌గౌడ్, మామిడి పద్మ, నాగభూషణం, లొడంగి గోవర్ధన్, వడ్డెబోయిన సైదులు, ఎంబీసీ రాష్ట్ర కన్వీనర్ నిమ్మల వీరన్న, దత్తాత్రి, నారబోయిన భిక్షం, సింగం లక్ష్మి, కోండ్ర స్వరూప, పద్మావతి గౌడ్, రూపని నర్సింహ, మెరుగు గోపీనాథ్ పాల్గొన్నారు.

పూలే, జయశంకర్ సర్ విగ్రహాలకు కవిత నివాళి

బీసీ రౌండ్ టేబుల్ సమావేశానికి వచ్చిన ఎమ్మెల్సీ కల్వకుంట్ల కవిత ముందుగా క్లాక్ టవర్ సెంటర్‌లో మహాత్మా జ్యోతీరావు పూలే విగ్రహానికి పూలమాల వేసి నివాళులర్పించారు. అనంతరం మున్సిపల్ ఆఫీస్ సమీపంలో ఉన్న జయశంకర్ సర్ విగ్రహానికి పూల మాల వేశారు. జడ్పీ చైర్మన్ బండ నరేందర్‌రెడ్డి ఆమె బొకే అందజేసి స్వాగతం పలికారు. కార్యక్రమంలో మున్సిపల్ మాజీ చైర్మన్ మందడి సైదిరెడ్డి, నాయకులు కరీం పాషా, మేడె రాజీవ్ సాగర్, బోనగిరి దేవేందర్, అభిమన్యు శ్రీనివాస్, సుంకరి మల్లేశ్‌గౌడ్ పాల్గొన్నారు.

రౌండ్ టేబుల్ సమావేశానికి హాజరైన బీసీ సంఘాల నాయకులు

ఎన్నికల ముందు బీసీ నినాదాలు ఇచ్చి ఇప్పుడు వదిలేయడం సరికాదు

ఎన్నికల ముందు రాజకీయ పార్టీలు బీసీలకు హామీలు ఇచ్చి ఆ తర్వాత వదిలేయడం సరికాదు. బీఆర్ఎస్ ప్రభుత్వం గత ఎన్నికల్లో ఇచ్చిన హామీకి అనుగుణంగా ముస్లింలకు 12శాతం రిజర్వేషన్ అమలు చేయడంతోపాటు కుల గణన చేయాలని కేంద్రానికి 2015లో అసెంబ్లీలో తీర్మానం చేసి కేంద్రానికి నివేదించింది. బీసీలు ఆర్థికంగా ఎదుగాలంటే ప్రధానంగా విద్యే మూలమని గమనించిన కేసీఆర్ రాష్ట్రంలో 1,061 గురుకులాలు ఏర్పాటు చేశారు. ఇయ్యాల అధికారంలోకి వచ్చిన కాంగ్రెస్ కామారెడ్డిలో ప్రకటించినట్లు బీసీ డిక్లరేషన్‌ను అమలు చేయాలని డిమాండ్ చేస్తున్నాం. ఎన్నికల తర్వాత అమలు చేస్తామన్న 42 శాతం రిజర్వేషన్, కుల గణన, బీసీ సబ్ ప్లాన్ అమలు చేయాలి. లేదంటే రేవంత్ ప్రభుత్వాన్ని బీసీలు ఎండగట్టి దించే రోజు వస్తది.

–జూలూరి గౌరీశంకర్, తెలంగాణ సాహిత్య అకాడమీ మాజీ చైర్మన్

బీసీలకు 42శాతం రిజర్వేషన్ అమలు చేయాలి

అధికారంలోకి వచ్చిన వెంటనే కుల గణన చేసి బీసీలకు స్థానిక సంస్థల ఎన్నికల్లో 42శాతం రిజర్వేషన్ అమలు చేస్తామని కాంగ్రెస్ పార్టీ హామీ ఇచ్చినందున ఈ ఎన్నికల్లోపే పూర్తి చేయాలి. బీసీలు రాజకీయంగా ఎదుగాలంటే జనాభా తగ్గట్లు రిజర్వేషన్లు ఉండకపోతే అన్యాయం జరుగుతుంది. కాంగ్రెస్ ప్రభుత్వం ఇచ్చిన హామీలు నెరవేర్చకపోతే బీసీల ఆగ్రహాన్ని చూడాల్సి వస్తది. బీసీల పట్ల కనీస ఆలోచన చేయని సీఎం ఇప్పటి వరకు బీసీ శాఖకు మంత్రినే పెట్టలేదు. కుల గణన చేస్తే అసలు ఎవరు ఎంత మంది ఉన్నారో తెలుస్తుంది.

– గట్టు రాంచందర్‌రావు, యునైటెడ్ పూలే ఫ్రంట్ రాష్ట్ర కన్వీనర్

బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగాలి

బీసీలు రాజకీయంగా, ఆర్థికంగా ఎదుగాల్సి ఉంది. రాష్ట్రంలో బీసీలు ఎంత మంది ఉన్నారో లెక్క తేలాలంటే కుల గణన చేయాల్సిందే. కాంగ్రెస్ పార్టీ ఎన్నికల్లో ఇచ్చిన హామీనే అడుగుతున్నాం. బీసీల ఓట్లు లేకుండా రేవంత్‌రెడ్డి సీఎం అవలేదు. అందుకే ఇచ్చిన హామీని అమలు చేయాలి. ఏటా రూ.20వేల కోట్ల చొప్పున ఐదేండ్లు లక్ష కోట్లు బీసీ సబ్ ప్లాన్‌లో కేటాయిస్తే బీసీలు ఆర్థికంగా ఎదిగే అవకాశం ఉన్నందున వెంటనే అమలు చేయాలి.

– నోముల భగత్, నాగార్జున సాగర్ మాజీ ఎమ్మెల్యే

కేసీఆర్ ప్రభుత్వంలో సగం కార్పొరేషన్ పదవులు బీసీలకే..

నాటి ధర్మభిక్షం నుంచి నేటి కేసీఆర్ వరకు బీసీల అభివృద్ధి కోసం ఎంతో ప్రాధాన్యం ఇచ్చి వారు రాజకీయంగా, ఆర్థికంగా ఎదిగేందుకు దోహదపడ్డారు. గత ప్రభుత్వంలో రాష్ట్రవ్యాప్తంగా 54 కార్పొరేషన్ పదవులు ఇస్తే అందులో సగం మంది బీసీలే ఉన్నారు. నిత్యం బీఆర్ఎస్‌పై నిప్పులు చెరుగుతూ కల్వకుంట్ల కుటుంబ పార్టీ అని విమర్శలు చేసే రేవంత్‌రెడ్డి తన మంత్రివర్గంలో, సలహాదారుల్లో ఎందుకు రెడ్లనే పెట్టుకున్నారు.

– దూదిమెట్ల బాలరాజు యాదవ్, గొర్రెలు, మేకల అభివృద్ధి కార్పొరేషన్ మాజీ చైర్మన్

జాగృతి మరో గొప్ప పోరాటానికి సిద్ధపడటం సంతోషం

తెలంగాణ ఉద్యమంతోపాటు మన సంస్కృతి, సంప్రదాయాల కోసం పోరాటం చేసిన జాగృతి వ్యవస్థాపకురాలు కవిత ఆ తర్వాత ఢిల్లీలో పోరాటం చేసి మహిళా బిల్లు సాధించారు. ఇప్పుడు బీసీ బిల్లును చట్టబద్ధం చేయాలని పోరాటం చేయడం సంతోషంగా ఉన్నది. నల్లగొండ జిల్లాలో ఎంతో మంది రెడ్లను ఓడించి బీసీలు ఎమ్మెల్యేలుగా ఎన్నికయ్యారు. అలాంటి నల్లగొండ నుంచి ఈ పోరాటం మొదలు కావాల్సి ఉంది.

– రాంచంద్రనాయక్, ట్రైకార్ మాజీ చైర్మన్

బీసీల హక్కుల కోసం మౌనం వీడాలి

70 ఏండ్లుగా బీసీలం రాజ్యాధికారం కోసం పోరాటం చేస్తూనే ఉన్నాం. ఇకనైనా బీసీలు హక్కుల సాధన కోసం మౌనం వీడాలి. ఇయ్యాల బీసీలు తెలంగాణలో ఆత్మగౌరవంతో ఉన్నత విద్యను పొందుతున్నారంటే దానికి కారణం మాజీ ముఖ్యమంత్రి కేసీఆర్. రాష్ట్రంలో 1,061 గురుకులాలు ఏర్పాటు చేసిన కేసీఆర్ నల్లగొండ జిల్లాలో 76 గురుకులాలు ఏర్పాటు చేసి ఎస్సీ, ఎస్టీ, మైనార్టీ, బీసీ బిడ్డలకు నాణ్యమైన విద్యను అందిస్తున్నారు. జిల్లాకో మెడికల్ కళాశాల ఏర్పాటు చేయడం వల్ల ఇయ్యాల 2వేల నుంచి ఎనిమిది వేల మెడికల్ కళాశాలలు రాష్ట్రంలో ఏర్పాటు కావడానికి కారణం కేసీఆర్.

– పల్లె రవికుమార్, కల్లుగీత కార్పొరేషన్ మాజీ చైర్మన్

స్వామివారికి పట్టువస్త్రాలు తీసుకొస్తున్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, చిత్రంలో మంత్రులు ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కోమటిరెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య

యాదగిరిశుడి బ్రహ్మోత్సవాలకు శ్రీకారం

విష్వక్సేనారాధన, స్వస్తీవాచనం, రక్షాబంధనంతో ఉత్సవాలు ప్రారంభం

తొలిపూజల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం భట్టి, మంత్రులు

యాదగిరిగుట్ట, మార్చి11 : పంచ నారసింహుడిగా విరాజిల్లుతున్న యాదగిరిగుట్ట లక్ష్మీనరసింహ స్వామి వార్షిక, నవాహ్నిక బ్రహ్మోత్సవాలు పంచరాత్రాగమ శాస్త్రయుక్తంగా ప్రారంభించారు. సోమవారం ప్రభాత వేళ ప్రధానాలయంలో నిత్యపూజ కైంకర్యాల అనంతరం వైశేక హోమాలు, ప్రత్యేక తిరుమంజనం జరిపారు. స్వామివారిని బంగారం, వజ్రవైడూర్యాలు, వివిధ రకాల పూలతో దివ్యమనోహరంగా అలంకరించి ప్రధానాలయ ముఖ మండపంలో వేంచేపు చేశారు. విష్వక్సేనారాధన, నవకల శాభిషేకం, స్వస్తీవాచనం, రక్షాబంధనం, మంత్ర పుష్ప నీరాజనాలతో ఉత్సవాలకు శ్రీకారం చుట్టారు. సాయంత్రం మృత్సంగ్రహణం, అంకురారోపణం నిర్వహించారు. అంతకుముందు ఆలయ అనువంశిక ధర్మకర్త నరసింహమూర్తి, ఈఓ రామకృష్ణారావు, ప్రధానార్చకుడు నల్లన్‌ధీఘిళ్ లక్ష్మీనరసింహాచార్యులు, కాండూరి వేంకటాచార్యులు స్వామివారి గర్భాలయంలో ప్రత్యేక పూజలు చేసి బ్రహ్మోత్సవాలకు స్వామివారి అనుమతి స్వీకరించారు.

స్వామివారికి ఆది పూజలు..

పట్టువస్త్రాలతో దివ్యమనోహరంగా అలకరించిన స్వామివారిని ప్రధానాలయం ముఖ మండపంలో తూర్పునకు అభిముఖంగా అధిష్టింపజేశారు. స్వామివారికి నవకలశాభిషేకం అనంతరం బ్రహ్మోత్సవాలు నిర్విఘ్నంగా కొనసాగాలని, లోకాలకు శుభాలు కలుగాలని వేద మంత్రాలను పఠిస్తూ పాంచరాత్రాగమ శాస్త్ర రీతిలో విష్వక్సేన ఆరాధన జరిపారు. లోకమంతా సుభిక్షంగా, ఆయురారోగ్యాలతో ఉండాలని కోరుతూ స్వస్తీవాచన మంత్రాలతో భగవానుడిని వేడుకున్నారు. శుద్ధజలాలతో స్వామివారి ప్రధానాలయం, గర్భాలయం, ఆలయ మాఢ వీధులు, ప్రాకార మండపాలను సంప్రోక్షణ చేశారు. రక్షాబంధనాలను ప్రత్యేక పాత్రలో ఉంచి విమల మొదలగు అష్టదళ శక్తి దేవతలను ఆవాహనం చేసి మంత్రాలు, ధూప దీపాలను సమర్పిస్తూ రక్షాబంధనం జరిపారు. అనంతరం నారసింహులకు, ఆండాళ్ అమ్మవారు, ఆళ్వారు, రామానుజాచార్యులు, విష్వక్సేనుడు, ఉత్సవమూర్తులకు కంకణ ధారణ చేశారు. పూజా కార్యక్రమాలను ప్రధానార్చకులు, ఉప ప్రధానార్చకులు, యజ్ఞాచార్య బృందం, ఆలయ అర్చక బృందం, పారాయణం దార్లు అత్యంత వైభవంగా నిర్వహించారు.

సాయంత్రం కార్యక్రమాలు..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నిత్యారాధనల అనంతరం సాయంత్రం 6:30 గంటలకు మృత్సంగ్రహణం, అంకురారోపణ వేడుకలను ప్రధానార్చకులు, యజ్ఞాచార్యులు, అర్చక బృందం శాస్త్రానుసారంగా నిర్వహించింది. అంకురారోపణకు అవసరమైన మట్టి కోసం ఆలయ అర్చక బృందం మంగళ వాయిద్యాలతో వెళ్లి భూమాతను పూజించి పుట్ట మన్ను స్వీకరించింది. మట్టిని కొత్త పాలికలో పోసి నవధాన్యాలు వేసి మంత్ర జపములతో ప్రోక్షణ చేసింది.

తొలిపూజల్లో పాల్గొన్న సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు

బ్రహ్మోత్సవాల్లో భాగంగా సోమవారం జరిగిన తొలి పూజల్లో ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి దంపతులు, డిప్యూటీ సీఎం మల్లు భట్టివిక్రమార్క, మంత్రులు కోమటిరెడ్డి వెంకట్‌రెడ్డి, ఉత్తమ్‌కుమార్‌రెడ్డి, కొండా సురేఖ, ప్రభుత్వ విప్ బీర్ల అయిలయ్య దంపతులు పాల్గొన్నారు. ప్రధానాలయం ముఖ మండపంలోని ధ్వజస్తంభం ముందు భాగంలో చేపట్టిన స్వస్తీవాచనం, పుణ్యాహవచనంలో సీఎం రేవంత్‌రెడ్డి దంపతులు, మంత్రులు పాల్గొన్నారు. అనంతరం జ్యోతి ప్రజ్వలన చేసి వార్షిక బ్రహ్మోత్సవాలను ప్రారంభించారు. మొదటగా పంచనారసింహుడిని దర్శించుకుని కుటుంబం తరపున సీఎం రేవంత్‌రెడ్డి పట్టువస్త్రాలు, ఆయన సతీమణి గీతారెడ్డి ముత్యాల తలంబ్రాలు, పండ్లను స్వామివారికి సమర్పించారు. ఆలయ ప్రధానార్చకుడు నల్లన్‌ధీఘిళ్ లక్ష్మీనరసింహాచార్యులు వారికి ఆశీర్వచనం అందించారు. కాండూరి వేంకటాచార్యులు కంకణధారణ గావించారు. వారి వెంట ఎమ్మెల్యేలు కుంభం అనిల్‌కుమార్‌రెడ్డి, వేముల వీరేశం, మందుల సామేల్, బత్తుల లక్ష్మారెడ్డి ఉన్నారు.

నేడు ధ్వజారోహణం, దేవతాహ్వానం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా మంగళవారం రెండో రోజు ఉదయం 8 గంటలకు అగ్ని ప్రతిష్ట, 11 గంటలకు ధ్వజారోహణం, సాయంత్రం 6:30 గంటలకు భేరి పూజ, దేవతాహ్వానం, హవనం కార్యక్రమాలు జరుగనున్నాయి.

బీఆర్ఎస్సే భరోసా.. కేసీఆరే ముఖ్యం

- వ్యక్తులు వచ్చి పోతుంటారు.. ఉద్యమ పార్టీకి ఏమీ కాదు
- ప్రతి నిమిషం అందుబాటులో ఉంటా
- త్వరలోనే నియోజకవర్గ సమన్వయ కమిటీ
- హుజూర్‌నగర్ నాయకులు, కార్యకర్తలతో మాజీ మంత్రి గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి
- గ్రామాల వారీగా తరలివెళ్లిన కేడర్

తెలంగాణ భవన్‌లో బీఆర్ఎస్ జిల్లా నేతలతో మాట్లాడుతున్న మాజీ మంత్రి, ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి, పక్కన ఎంపీ బడుగుల, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు

సూర్యాపేట, మార్చి 11 (నమస్తే తెలంగాణ) : ప్రజలకైనా, బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలకైనా పార్టీనే భరోసా అని, కేసీఆరే ముఖ్యమని మాజీ మంత్రి, సూర్యాపేట ఎమ్మెల్యే గుంటకండ్ల జగదీశ్‌రెడ్డి అన్నారు. వ్యక్తులు వచ్చి పోతుంటారని, ఉద్యమంలో అనేక ఆటుపోట్లను ఎదుర్కొని తెలంగాణ రాష్ట్రాన్ని సాధించిన పార్టీకి ఏమీ కాదని స్పష్టం చేశారు. సోమవారం హుజూర్‌నగర్ నియోజకవర్గం నుంచి దాదాపు వందలాది బీఆర్ఎస్ నాయకులు, కార్యకర్తలు వాహనాల్లో హైదరాబాద్‌కు వెళ్లి జగదీశ్‌రెడ్డిని కలిశారు. పెద్దఎత్తున కేడర్ రావడంతో హుటాహుటిన ప్రత్యేక సమావేశం ఏర్పాటు చేసి.. అందుబాటులో ఉన్న బడుగుల లింగయ్యయాదవ్, ఎమ్మెల్సీ కోటిరెడ్డి, మాజీ ఎమ్మెల్యేలు గాదరి కిశోర్‌కుమార్, భూపాల్‌రెడ్డి, భాస్కర్‌రావు, మల్లయ్యయాదవ్, ఒంటెద్దు నర్సింహారెడ్డి, చెరుకు సుధాకర్‌ను పిలిచారు. ఈ సందర్భంగా మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి మాట్లాడుతూ కేడర్‌కు ప్రతి క్షణం తాను అందుబాటులో ఉంటానని భరోసానిచ్చారు. బీఆర్ఎస్ జిల్లా అధ్యక్షుడు బడుగుల లింగయ్యయాదవ్‌తో కలిసి త్వరలోనే నియోకవర్గ సమన్వయ కమిటీలు వేస్తామని చెప్పారు. పార్టీ కేడర్ ఆందోళన చెందాల్సిన పని లేదని తెలిపారు. గతంలో కంటే ఉత్సాహంగా పని చేయాలని, పార్టీ అండగా ఉంటుందని తెలిపారు. హైదరాబాద్‌కు వెళ్లిన నాయకుల్లో పలువురు మాట్లాడుతూ తమకు స్వేచ్ఛ లభించిందని, పార్లమెంట్ ఎన్నికల్లో బీఆర్ఎస్ పార్టీ సత్తా చాటుతామని ఉత్సాహంగా మాట్లాడారు.

సైదిరెడ్డికి ఎంపీ టికెట్ ఇవ్వద్దు

- బీజేపీ ఉమ్మడి జిల్లా ముఖ్యుల ఆందోళన

నల్లగొండ ప్రతినిధి, మార్చి11 (నమస్తే తెలంగాణ) : హుజూర్‌నగర్ మాజీ ఎమ్మెల్యే శానంపూడి సైదిరెడ్డి బీజేపీలో చేరడంపై ఆ పార్టీ నేతలు భగ్గుమంటున్నారు. సైదిరెడ్డి చేరికపై తమకు తీవ్ర అభ్యంతరం ఉందని, ఎట్టి పరిస్థితుల్లోనూ ఆయనకు నల్లగొండ ఎంపీ టికెట్ ఇవ్వద్దని పార్టీ హై కమాండ్‌ను హెచ్చరిస్తున్నారు. స్థానిక నేతల అభిప్రాయాలు, మనోభావాలకు భిన్నంగా పార్టీ అధిష్టానం నిర్ణయం తీసుకుంటే ఎన్నికల్లో సహాయ నిరాకరణ తప్పదని స్పష్టం చేశారు. ఈ మేరకు సోమవారం ఆ పార్టీ జిల్లా ముఖ్య నేతలు రాష్ట్ర కార్యాలయానికి వెళ్లి గోడును వెళ్లబోసుకున్నారు. గంగిడి మనోహర్‌రెడ్డి, గోలి మధుసూదన్‌రెడ్డి, గార్లపాటి జితేందర్‌కుమార్, బొబ్బ భాగ్యరెడ్డి నేతృత్వంలో ఉమ్మడి జిల్లాకు చెందిన పార్టీ ముఖ్య నేతలు రాష్ట్ర కార్యాలయంలోని బీజేపీ పెద్దలను కలిశారు. పార్టీ రాష్ట్ర ఆర్గనైజింగ్ సెక్రటరీ చంద్రశేఖర్ తివారీ ఎదుట తమ అభ్యంతరాలను వ్యక్తం చేశారు. సైదిరెడ్డి బీజేపీ నేతలు, కార్యకర్తలపై అక్రమ కేసులు పెట్టించారని వివరించారు. ఈ సందర్భంగా గుర్రంబోడు భూముల విషయంలో జరిగిన వివాదం తాలూకు వీడియోలను, ఫొటోలను తివారీకి చూపించారు. సైదిరెడ్డిని పార్టీలో చేర్చుకోవద్దని తాము ముందే అభ్యంతరం తెలిపినట్లు గుర్తు చేశారు. ఈ పరిస్థితుల్లో శానంపూడికి ఎంపీ టికెట్ ఇస్తే తామంతా సహాయ నిరాకరణ చేస్తామని స్పష్టం చేసినట్లు తెలిపారు. పార్టీ కోసం ఆది నుంచి పని చేస్తున్న నేతల్లో అర్హులైన వారికే టికెట్ దక్కేలా చూడాలని కోరారు. ఆ విషయాలన్నీ నోట్ చేసుకున్న చంద్రశేఖర్ తివారీ పార్టీ జాతీయ పెద్దల దృష్టికి తీసుకెళ్తామని హామీ ఇచ్చినట్లు జిల్లా నేతలు తెలిపారు.

RIVER HOSPITALS
రంజాన్ మాస శుభాకాంక్షలతో...
అపాయింట్‌మెంట్ కొరకు
9121212540
24/7 బ్రెయిన్ స్ట్రోక్ సెంటర్
ఎమర్జెన్సీ & క్రిటికల్ కేర్
ఇప్పుడు మన రివర్ హాస్పిటల్ లో
డా॥ కె. రాబు
నరాల, మెదడు మరియు వెన్నుపూస వైద్య నిపుణులు
MBBS, MD (General Medicine - PGI Chandigarh)
DM (NEUROPHYSICIAN - PGI Chandigarh)
CONSULTANT NEUROPHYSICIAN
మా హాస్పిటల్ లో అందించు వైద్య సేవలు
పెరాలసిస్ (పక్షవాతం)
మూర్ఛ (ఫిట్స్)
మతిమరుపు (అల్జిమర్స్)
తల నొప్పులు, మెడ నొప్పులు
వెన్నుపూస నొప్పులు
కండరాల వాపు, కండరాల బలహీనత
అటాక్సియా & అసంతులనం
మైనింజైటిస్ (బ్రెయిన్ ఫివర్)
బ్రెయిన్ ట్యూమర్లు
తిమ్మిర్లు & నరాల బలహీనత
కళ్ళు తిరగటం (వెర్టిగో)
కాళ్ళు చెతులు వణకటం, పనిచేయకపోవడం
అత్యాధునిక 50 Slice CT స్కాన్
EEG, NCS, RNST, EMG టెస్టులతో పాటు బొటాక్స్ ఇంజక్షన్ ఇవ్వబడును
డాక్టర్స్ కాలనీ, చ